క్లుప్తంగా...

సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన సాయికుమార్



అబిడ్స్: సీఎం రేవంత్ రెడ్డిని రాష్ట్ర ఫిషరీష్ చైర్మన్ మెట్టు సాయికుమార్ కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మత్స్యశాఖ విభాగంలో కొనసాగుతున్న అభివృద్ధిని ముఖ్యమంత్రికి వివరించారు.

శుభాకాంక్షలు



మంత్రితో దల్లు శివ

చార్మినార్: కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, దల్లు యువ సేన ప్రతినిధి దల్లు శివ శుక్రవారం ఆరోగ్య శాఖ మంత్రి సి. దామోదర రాజనర్సింహను మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియ జేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రజలు ఆయురారోగ్యాలతో చల్లంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో యాకుత్‌పురా ఏ-బ్లాక్ ప్రెసిడెంట్ మామిడాల శ్రీనివాస్ ఉన్నారు.

పాతబస్తీ అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలి



మేయర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న శ్యాంరావు ముదిరాజ్

చాంద్రాయణగుట్ట: పాతబస్తీ అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని గ్రేటర్ కాంగ్రెస్ ఓబీసీ సెల్ ఉపాధ్యక్షుడు కాశమోని శ్యాంరావు ముదిరాజ్ కోరారు. ఈ మేరకు శుక్రవారం ఆయన జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మిని కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేయడంతో పాటు సమస్యలను విన్నవించారు. చాంద్రాయణగుట్ట నియోజవర్గంలో పాత కచ్చామోరీలను ఇప్పటికీ కొనసాగిస్తుండడంతో ముంపు సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆయా బస్తీలలో బాక్స్ డ్రైన్‌లను నిర్మించాలని కోరారు.

వైకుంఠ ఏకాదశి ఉత్సవాలకు ఆహ్వానం



మంత్రి సీతక్కకు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న ఆత్రేయ ఆచార్య

చార్మినార్: చౌక్ మైదాన్ ఖాన్‌లోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో జరుగబోయే వైకుంఠ ఏకాదశి వేడుకల్లో పాల్గొనాలని మంత్రి సీతక్కను బాలాజీ ఆలయ అర్చకులు, అలంకార బ్రహ్మ శృంగరం ఆత్రేయ చార్యులు కోరారు. ఈ మేరకు శుక్రవారం ఆమెను కలిసి శాలువా కప్పి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఉత్సవాల సందర్భంగా భక్తులకు ఇబ్బంది కలగకుండా సంబంధిత ప్రభుత్వ విభాగాల అధికారులకు ఆదేశాలు జారీ చేయాలని సీతక్కని కోరినట్లు ఆయన తెలిపారు. తమ విజ్ఞప్తి మేరకు మంత్రి సీతక్క వెంటనే స్పందించి సంబంధిత ప్రభుత్వ విభాగాల అధికారులకు ఆదేశాలు జారీ చేశారన్నారు.

సన్మానం



గౌలిపురా: తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు బొమ్మ మహేశ్ కుమార్‌గౌడ్‌ను చార్మినార్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ మాజీ ఇన్‌చార్జి కె.వెంకటేశ్ మర్యాదపూర్వకంగా కలిశారు. శుక్రవారం గాంధీభవన్‌లో మహేశ్ కుమార్ గౌడ్‌ను వెంకటేశ్ సన్మానించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

సంక్షేమ పథకాలు అందరికీ అందించేందుకు కృషి చేయాలి



మేయర్‌ను కలిసిన మమతా గుప్తా, సంతోష్‌గుప్తా

అబిడ్స్: మేయర్ గద్వాల విజయలక్ష్మిని గోషామహల్ నియోజకవర్గం కాంగ్రెస్ నాయకులు, మాజీ కార్పొరేటర్ మమతా గుప్తా, సంతోష్ గుప్తా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ..సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు అందరికీ అందించేందుకు కృషి చేయాలన్నారు.

26 నుంచి ఆమరణ నిరాహార దీక్ష



అఫ్జల్‌గంజ్: పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ పేరు మార్పుపై ప్రభుత్వం నిర్ణయం వెనక్కి తీసుకోకపోతే ఈ నెల 26 నుంచి ఆమరణ నిరాహార దీక్షకు దిగనున్నట్లు ప్రజా ఏక్తా పార్టీ జాతీయ అధ్యక్షుడు బోనాల శ్రీనివాస్ పేర్కొన్నారు. శుక్రవారం మహరాజ్‌గంజ్‌లోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ..తాను చేపట్టబోయే దీక్షకు పలు రాజకీయ, సామాజిక, కుల సంఘాల నుంచి మద్దతు వస్తుందని తెలిపారు. దేవరకొండకు చెందిన పడమటి తాండ ఉప సర్పంచ్ రత్లావత్ పాండు బోనాల శ్రీనివాస్‌ను కలిసి దీక్షకు సంపూర్ణ మద్దతు ప్రకటించారు.

సావిత్రిబాయి పూలే సేవలు చిరస్మరణీయం



సావిత్రిబాయి పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రొఫెసర్ చంద్రముఖర్జీ

భారతదేశ తొలి మహిళా ఉపాధ్యాయురాలు, సామాజిక సంఘ సేవకురాలు సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు శుక్రవారం అబిడ్స్, చార్మినార్, మెహిదీపట్నం జోన్ల పరిధిలోని అన్ని ప్రాంతాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్ర పటాలకు పూలమాలు వేసి నివాళులర్పించారు. సావిత్రీబాయి చేసిన సేవలను పలువురు కొనియాడారు. మహిళా సాధికారతకు సావిత్రిబాయి చూపిన చొరవ చిరస్మరణీయమని కీర్తించారు. ఆమె అడుగు జాడల్లో యువతరం పయనించాలని సూచించారు.

– అబిడ్స్, చార్మినార్, మెహిదీపట్నం జోన్ల బృందం



వేడుకల్లో చాకలి ఐలమ్మ మనుమరాలు శ్వేత ఐలమ్మ తదితరులు



సుద్దాల అశోక్‌తేజను సన్మానిస్తున్న దృశ్యం



నివాళులర్పిస్తున్న ఐద్వా శశికళ తదితరులు



నివాళులర్పిస్తున్న ఫౌండేషన్ అధ్యక్షుడు రాజేష్‌యాదవ్, సభ్యులు



నివాళులర్పిస్తున్న అంబటి శ్రీనివాస్, రేణుక తదితరులు



నాంపల్లి కోర్టులో బార్ అసోసియేషన్‌లో..



నివాళులర్పిస్తున్న ఏడీ.శ్రీనివాస్‌రెడ్డి, కేఆర్.రాజ్‌కుమార్, భాస్కర్



వేడుకల్లో బీఆర్ఎస్ నాయకుడు మనోహర్ గైక్వాడ్, ప్రిన్సిపాల్ శ్రీధర్

ఉద్యోగులకు అండగా టీఎన్జీఓస్ సెంట్రల్ యూనియన్



మారం జగదీశ్వర్, డాక్టర్ ఎస్ఎం ముజీబ్ హుస్సేనిని సత్కరిస్తున్న విక్రమ్‌కుమార్, కేఆర్.రాజ్‌కుమార్

గన్‌ఫౌండ్రీ: ఉద్యోగులకు అండగా ఉండి వారి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు టీఎన్జీఓస్ సెంట్రల్ యూనియన్ కృషి చేస్తుందని యూనియన్ అధ్యక్షుడు మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్ఎం.ముజీబ్ హుస్సేనీ పేర్కొన్నారు. టీఎన్జీఓస్ యూనియన్ హైదరాబాద్ అధ్యక్షుడు విక్రమ్‌కుమార్, అసోసియేట్ అధ్యక్షుడు కేఆర్.రాజ్‌కుమార్‌లతో పాటు పలువురు నాయకులు వారిని ఘనంగా సత్కరించి నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. టీఎన్జీఓస్ నాయకులు బాల్‌రాజ్, ఉమర్‌ఖాన్, శ్రీనివాస్, కొండల్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, ఉమారెడ్డి, ఖాలీద్ అహ్మద్, వైదిక్ శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

కేలండర్ ఆవిష్కరణ

అబిడ్స్: ది ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ టింబర్ మర్చంట్స్ సా మిల్లర్ అండ్ అలైడ్ ఇండస్ట్రీస్ 2025 కేలండర్‌ను ఆవిష్కరించారు. లక్డీకాపూల్‌లోని కార్యాలయంలో శుక్రవారం పీసీసీఎఫ్‌లు డోబ్రియాల్, రామలింగం, ఇతర అధికారులు ఏలుసింగ్ మేరు, సువర్ణ, సునిత భగవత్ ఆవిష్కరించారు. రాష్ట్ర అధ్యక్షుడు చకిలం రమణయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వివిధ జిల్లాల నుంచి పెద్ద ఎత్తున సభ్యులు హాజరయ్యారు. పీసీసీఎఫ్‌లు డోబ్రియాల్, రామలింగం మాట్లాడుతూ.. పర్యావరణాన్ని కాపాడేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సెక్రెటరి గోపీకృష్ణ, ఇతర నాయకులు గోవింద్ పటేల్, తిరుపతి గౌడ్, ప్రదీప్ రెడ్డి, ఎంజె.పటేల్ తదితరులు పాల్గొన్నారు.



కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న డోబ్రియాల్, రామలింగం

చైనా మాంజాను నిషేధించాలి



డీసీపీకి వినతి పత్రాన్ని అందజేస్తున్న బోయ నగేష్

చాంద్రాయణగుట్ట: ప్రమాదాలకు కారణమవుతున్న చైనా మాంజాను నిషేధించాలని కాంగ్రెస్ పార్టీ చాంద్రాయణగుట్ట నియోజకవర్గం ఇన్‌చార్జి బోయ నగేష్ కోరారు. జంగమ్మెట్‌లో చైనా మాంజాతో పిల్లలు ఆడుకునే క్రమంలో కళావతి అనే వృద్ధురాలి కాలి నరం తెగిన విషయం తెలుసుకున్న నగేష్ ఆమెను పరామర్శించారు. అనంతరం ఈ ఘటన విషయమై సౌత్ ఈస్ట్ డీసీపీ కాంతిలాల్ పాటిల్‌ను శుక్రవారం కలిసి బ్యాన్ చేయాలని విన్నవించారు. ఈ సందర్భంగా నగేష్ మాట్లాడుతూ.. నూతన సంవత్సరం, సంక్రాంతి పండుగ వచ్చిందంటే చిన్నారులు పెద్ద ఎత్తున గాలి పటాలను ఎగురవేయడం జరుగుతుందన్నారు. దారం తెగరాదన్న ఉద్దేశంతో చైనా మాజాను విరివిగా వినియోగిస్తున్నారన్నారు. ప్రమాదాలకు కారణమవుతున్న వీటిపై చర్యలు తీసుకోవాలన్నారు.

చోరీలకు పాల్పడుతున్న తల్లీ, కుమారుడి రిమాండ్

డబీర్‌పురా: చోరీలకు పాల్పడుతున్న తల్లీ, కుమారుడిని శుక్రవారం రెయిన్‌బజార్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మీర్‌చౌక్ ఏసీపీ వెంకటేశ్వరరావు, ఇన్‌స్పెక్టర్ ఎల్.రమేశ్ నాయక్‌తో కలిసి వివరాలను వెల్లడించారు. యాకుత్‌పురా నాగబౌలికి చెందిన షేక్ జరీనా (45), షేక్ ఇర్షాద్ (22) తల్లీ కొడుకులు. ఇద్దరూ కలిసి ఇళ్లను టార్గెట్‌గా చేసుకొని పలు ఇళ్లల్లో దొంగతనాలకు పాల్పడ్డారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని శుక్రవారం షేక్ జరీనా, షేక్ ఇర్షాద్‌ను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.3.20 లక్షల విలువ చేసే బంగారు వివిధ రకాల ఆభరణాలు, రూ.3.5 లక్షల నగదును స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు.

అలరించిన యల్లాప్రగడ సిస్టర్స్ నృత్య ప్రదర్శన



నాంపల్లి: అభినయవాణి నృత్యానికేతన్ ద స్కూల్ ఆఫ్ కూచిపూడి డ్యాన్స్ సంస్థ ఆధ్వర్యంలో నృత్య గురువు త్రిపుర సుందరి పర్యవేక్షణలో కూచిపూడి నృత్య సంప్రదాయాన్ని అవపోసన పట్టిన యల్లాప్రగడ సిస్టర్స్ డాక్టర్ కీర్తన, డాక్టర్ వైష్ణవి నృత్య ప్రదర్శన శుక్రవారం రాత్రి నాంపల్లిలోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నందమూరి తారక రామారావు కళా మందిరంలో వైభవోపేతంగా జరిగింది. కూచిపూడి నృత్యాంశాలకు నర్తకీమణులు తమదైన శైలిలో నర్తించి అలరింపజేశారు. సిలికానాంధ్ర విశ్వవిద్యాలయం కూచిపూడి నృత్య విభాగం ప్రొఫెసర్ డాక్టర్ సుమిత్ర వేలూరి, నృత్య గురువు వైదేహి యెల్లె హాజరై సిస్టర్స్‌ను అభినందించారు. వైద్య రంగంలో సేవలందిస్తూనే నృత్య కళపై యల్లాప్రగడ సిస్టర్స్ మక్కువ పెంచుకుని అద్భుతమైన ప్రతిభను సొంతం చేసుకున్నారని ప్రశంసించి ఘనంగా సత్కరించారు.

ప్రైవేటు టీచర్లు విద్యారంగానికి కీలకం



మాట్లాడుతున్న ప్రొఫెసర్ ఇటిక్యాల పురుషోత్తం

గన్‌ఫౌండ్రీ: విద్యారంగ వ్యవస్థలో ప్రైవేట్ టీచర్స్ సేవలను ప్రభుత్వం గుర్తిస్తుందని తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్ ప్రొఫెసర్ ఇటిక్యాల పురుషోత్తం అన్నారు. శుక్రవారం రవీంద్రభారతిలో తెలంగాణ రాష్ట్ర ప్రైవేట్ టీచర్స్ లెక్చరర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో విద్యారంగ రాష్ట్ర సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..సమాజంలో ప్రతి ఒక్కరిచేత గౌరవించబడే వృత్తి ఉపాధ్యాయ వృత్తి అని అలాంటి వృత్తిలో ఉన్న ప్రైవేటు టీచర్స్ కూడా సమాజానికి కీలక సేవ చేస్తున్నారని కొనియాడారు. సంస్థ కన్వీనర్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ..ప్రైవేటు టీచర్స్ సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవాలని, హెల్త్ భీమా, గుర్తింపు కార్డులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజా కవి జయరాజు, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి నాగరాజు, టీపీటీఎల్ఎఫ్ రాష్ట్ర నాయకులు పుట్టపాగ విజయ్, సైదులు, అయోధ్య, వెంకటస్వామి, విద్యార్థి సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

వీడీసీసీ పనులు ప్రారంభం



గౌలిపురా: లాల్‌దర్వాజా సింహవాహిణి ఆలయం వద్ద జీహెచ్ఎంసీ ద్వారా చేపట్టిన వీడీసీసీరోడ్డు పనులను శుక్రవారం కార్పొరేటర్ ఆలె భాగ్యలక్ష్మి, మాజీ కార్పొరేటర్, ఆలయ చైర్మన్ సి.రాజేందర్‌యాదవ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..స్థానిక దుకాణదారులు, బస్తీవాసులు, ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆలయ కమిటీ సభ్యులు తన దృష్టికి తీసుకురావడంతో జీహెచ్ఎంసీ ద్వారా రూ.42 లక్షల బోనాల పండుగ నిధులతో మంజూరు చేయించడం జరిగిందన్నారు. ఏఈ తేజోవంత్, బీజేపీ నాయకులు సుమన్ కుమార్ ముదిరాజ్, జమాల్‌పూర్ చంద్రశేఖర్, జి.రఘుకాంత్, బి.రమేశ్ యాదవ్, కె.సాయి కుమార్, కొడి సురేందర్ పాల్గొన్నారు.

గోల్కొండ డిప్యూటీ ఐఓఎస్‌గా మహ్మద్ బషీర్



మహ్మద్ బషీర్‌ను సన్మానిస్తున్న దృశ్యం

గోల్కొండ: గోల్కొండ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్‌గా మహ్మద్ బషీర్ నియమితులయ్యారు. ఇప్పటి వరకు ఈ స్థానంలో ఉన్న మక్బుల్ అహ్మద్ ఆరోగ్య కారణంగా సెలవుపై వెళ్లడంతో మహ్మద్ బషీర్ నియమితులయ్యారు. గోల్కొండ ప్రభుత్వ బాలుర సెకండ్ ల్యాన్సర్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా కూడా విధులు నిర్వహిస్తున్న ఆయనను ఈ పదవిలో నియమించారు. డిప్యూటీ ఐఓఎస్‌గా నియమితులైన ఆయనను శుక్రవారం పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల వారు సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అందరి సహకారంతో విధులను సమర్థవంతంగా నిర్వహించేందుకు కృషి చేస్తానన్నారు.

ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపు



లంగర్‌హౌస్: ఫుట్‌పాత్‌లను ఆక్రమించి ప్రమాదాలకు కారణమయ్యే వారిని ఉపేక్షించేది లేదని ట్రాఫిక్ ఏసీపీ ధనలక్ష్మి, లంగర్ హౌస్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ అంజయ్య అన్నారు. శుక్రవారం నానల్‌నగర్ నుంచి టోలీచౌకి వరకు ఫుట్‌పాత్ ఆక్రమణలను తొలగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..టోలీ చౌకి వద్ద ఫుట్‌పాత్‌తో పాటు రోడ్డుపైనే వేసి రోడ్డు కబ్జా చేసి ఇసుక, కంకర వేసి వ్యాపారాలు చేస్తున్నారన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఇక్కడ రోడ్డు ప్రమాదాలు కూడా చోటుచేసుకుంటున్నాయన్నారు. దీంతో వ్యాపారాలను తొలగించామన్నారు.

శోభనకు సావిత్రిబాయి పూలే ఎక్సలెన్సీ అవార్డు ప్రదానం



అవార్డును అందజేస్తున్న జస్టిస్ వామన్‌రావు

గన్‌ఫౌండ్రీ: మహిళల విద్యాభివృద్ధి హక్కుల కోసం తన జీవితాన్ని దారపోసిన మహోన్నత వ్యక్తి సావిత్రిబాయి పూలే అని ట్రిబ్యూనల్ అడ్మినిస్ట్రేటీవ్ కోర్టు చైర్మన్ జస్టిస్ వామన్‌రావు అన్నారు. ఈ మేరకు శుక్రవారం తెలంగాణ మేధావుల ఫోరం రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలోని సరోజినినాయుడు వనిత మహా విద్యాలయ కళాశాలలో సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.శోభనకు సావిత్రిబాయి పూలే ఎక్సలెన్సీ అవార్డును అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మేధావుల ఫోరం రాష్ట్ర శాఖ అధ్యక్షుడు డాక్టర్ రాజ్‌నారాయణ్ ముదిరాజ్, ఓయూ ప్రొఫెసర్ డాక్టర్ అక్తర్ అలీ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ టెక్నికల్ ఆఫీసర్ డాక్టర్ రవితే, కళాశాల కార్యదర్శి రాజేందర్‌లతో పాటు కళాశాల బోధనా సిబ్బంది పాల్గొన్నారు.

'దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే'



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ నరేంద్రకుమార్, మాజీ ప్రిన్సిపాల్ శశికళారెడ్డి తదితరులు

సుల్తాన్‌బజార్: దేశ ఉజ్వల భవిష్యత్తు యువత పైనే ఉందని ఉస్మానియా వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నరేంద్రకుమార్ అన్నారు. జాతీయ యువజన దినోత్సవం నేషనల్ మెడికోస్ ఆర్గనైజేషన్ (ఎన్ఎంఓ) తెలంగాణ ఆధ్వర్యంలో ఉభయ రాష్ట్రాల విద్యార్థినీ విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థులకు వకృత్వ, క్విజ్ ప్రజంటేషన్, షార్ట్ ఫిల్మ్ మేకింగ్ లాంటి వివిధ పోటీలు కోఠిలోని ఉస్మానియా వైద్య కళాశాల ఆడిటోరియంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నరేంద్రకుమార్, మాజీ ప్రిన్సిపాల్ డాక్టర్ శశికళారెడ్డి హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ప్రపంచ దేశాలన్నిటిలో భారతదేశంలోని యువత అత్యధిక సంఖ్యలో ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాళ్లు డాక్టర్ నాగార్జున, డాక్టర్ పద్మావతి, డాక్టర్ రమేష్ మధుర్, తెలంగాణ ఎన్ఎంఓ జనరల్ సెక్రెటరీ డాక్టర్ సురేంద్రబాబు, డాక్టర్ ఎల్ఆర్ఎస్ఎస్ రావు, డాక్టర్ గుండు శ్రీనివాస్, డాక్టర్ విష్ణు పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీలో ఎస్సీలకు మొండి చెయ్యి



క్షత్రి ప్రవీణ్‌కుమార్

నాంపల్లి: ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన గుడిమల్కాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీలో సామాజిక న్యాయం లేదని గ్రేటర్ హైదరాబాద్ కాంగ్రెస్ కమిటీ కార్యదర్శి క్షత్రి ప్రవీణ్ కుమార్ ఆరోపించారు. ఈ మేరకు ఆయన శుక్రవారం నాంపల్లిలో విలేకర్లతో మాట్లాడారు. గుడిమల్కాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీలో ఎస్సీలకు సముచితమైన స్థానం లేదని విమర్శించారు. ఎస్సీలకు న్యాయం చేయడంలో నాంపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జి మహ్మద్ ఫిరోజ్ ఖాన్ పూర్తిగా వైఫల్యం చెందారని మండిపడ్డారు. ఓసీ, బీసీ, మైనార్టీలతోనే గుడిమల్కాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీని పూర్తిగా నింపేశారని ఎద్దేవా చేశారు. పార్టీ కోసం పనిచేసిన కార్యకర్తలను పక్కన పెట్టి తన పీఏలను కమిటీలో సభ్యులుగా నియమించుకున్నారని వాపోయారు. ఫిరోజ్ ఖాన్ గెలుపు కోసం తాము ప్రాణాలను సైతం తెగించి పనిచేశామని, మజ్లిస్‌కు వ్యతిరేకంగా నిలబడి నాంపల్లిలో పోరాడమని, అలాంటి తమను పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. ఎస్సీలపై వివక్షను చూపడం, మార్కెట్ కమిటీలో ఎస్సీలకు చోటు కల్పించకపోవడం ఆయనలోని నిజ స్వరూపం బయటపడిందన్నారు. ఇకపై కాంగ్రెస్ పార్టీ ఫిరోజ్ ఖాన్‌కు నాంపల్లిలో టికెట్ ఇస్తే ప్రజలే ఘోరంగా ఓడిస్తారన్నారు. ఫిరోజ్ ఖాన్ మాటలు విని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఏకపక్ష నిర్ణయాలు తీసుకోవడం, ఎస్సీలకు మొండి చెయ్యి చూపడం సరికాదన్నారు. వ్యవసాయంతో సంబంధం లేని వ్యక్తులతో కమిటీని నింపేశారని ఆరోపించారు.

విద్యార్థుల ఫీజుల బకాయిలు వెంటనే చెల్లించాలి



ధర్నాలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య, వేముల రామకృష్ణ తదితరులు

విజయనగర్‌కాలనీ: విద్యార్థుల ఫీజుల బకాయిలు వెంటనే చెల్లించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య అన్నారు. శుక్రవారం బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు వేముల రామకృష్ణ ఆధ్వర్యంలో దాదాపు 4 వేల మంది విద్యార్థులు బీసీ సంక్షేమ భవన్‌ను ముట్టడించారు. పెద్ద ఎత్తున పోలీసులు వచ్చి బందోబస్తు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ..ఫీజుల బకాయిలు సకాలంలో చెల్లించకపోవడంతో విద్యార్థుల భవిష్యత్తు గందరగోళంగా మారిందన్నారు. ఈ కార్యక్రమంలో నీల వెంకటేష్, గుజ్జ సత్యం, పగిళ్ల సతీష్, అనంతయ్య, రవికుమార్ యాదవ్, రాజేందర్, పృథ్వీగౌడ్, చంద్రశేఖర్, నిఖిల్, ప్రసాద్, అరవింద్, రమాదేవి, లక్ష్మీ, నరేష్‌గౌడ్, మంజువాణి, బాలస్వామి, ఉమేష్, శివ, నర్సింహ పాల్గొన్నారు.

అన్ని వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం కృషి



కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న గోపిశెట్టి నిరంజన్, ఆకుల శ్రీరాములు

చార్మినార్: అన్ని వర్గాల సంక్షేమానికి తమ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని రాష్ట్ర వెనుకబడిన తరగతుల కమిషన్ చైర్మన్ గోపిశెట్టి నిరంజన్ అన్నారు. పాత నగరం మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు ఆకుల శ్రీరాములు, ప్రధాన కార్యదర్శి బిట్ల హంసరాజ్ తదితరుల ఆధ్వర్యంలో రూపొందించిన సంఘం నూతన కేలండర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలోని తమ ప్రభుత్వం కుల, మతాలకతీతంగా అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహిస్తోందన్నారు. పాత నగర మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు ఆకుల శ్రీరాములు మాట్లాడుతూ..సామాజిక సేవా కార్యక్రమాల్లో తమ సంఘం అన్ని సంఘాల కన్నా ముందుందన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు దేవరశెట్టి ప్రభాకర్, కసారపు చంద్ర కుమార్, పల్లె శ్రావణ్ కుమార్, పోసు కృష్ణ, కోశాధికారి మామిడి నరసింగరావు, కార్యదర్శి కాటికే శ్రీధర్ రావు పాల్గొన్నారు.

గోల్కొండ ఆసుపత్రి పనితీరు మరింత మెరుగుపడాలి



ఎమ్మెల్యే కౌసర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న డాక్టర్ పి.వి.శ్రీనివాసరావు

గోల్కొండ: గోల్కొండ ఏరియా ఆసుపత్రి పనితీరు మరింత మెరుగుపడాలని ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్ అన్నారు. శుక్రవారం గోల్కొండ ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ ఎమ్మెల్యేను ఆయన కార్యాలయంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం గోల్కొండ ఏరియా ఆసుపత్రి వైద్యులు, నర్సింగ్ సిబ్బంది, ఫార్మసీ విభాగాలకు చెందిన వివరాలను ఎమ్మెల్యేకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గోల్కొండ ఏరియా ఆసుపత్రి అభివృద్ధి విషయంపై తాను ఎన్నోసార్లు కలెక్టర్‌తో పాటు రాష్ట్ర మంత్రిని కూడా కలిశానన్నారు. గత అసెంబ్లీ సమావేశాల్లో గోల్కొండ ఏరియా ఆసుపత్రిలో కొత్త బ్లాక్ ఏర్పాటుకు ప్రభుత్వాన్ని ప్రశ్నించానన్నారు. ఆసుపత్రి వైద్యులు, సిబ్బందితో సమావేశాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ కె.సంపత్‌కుమార్ తదితరులున్నారు.

విద్యార్థినులు అన్ని రంగాల్లో రాణించాలి



శ్లోకా స్కూల్ విద్యార్థినులకు కప్‌ను అందజేస్తున్న కార్పొరేటర్ దర్శన్

జియాగూడ: విద్యార్థినులు అన్ని రంగాల్లో రాణించాలని జియాగూడ కార్పొరేటర్ బోయిని దర్శన్ అన్నారు. శుక్రవారం సావిత్రీబాయి పూలే జయంతి వేడుకలను పురస్కరించుకొని మహాత్మా జ్యోతిరావు పూలే యువ మంచ్ ఆధ్వర్యంలో శాంతినగర్ శ్లోకా ది స్కూల్‌లో ఏర్పాటైన కబడ్డీ, ఖోఖో, మల్కామ్ పోటీలకు ప్రభుత్వ బేగంబజార్, షాహినాయత్‌గంజ్, కుల్సుంపురా పాఠశాలలు, శ్లోకా స్కూల్, కృష్ణవేణి స్కూల్ విద్యార్థులు పోటీల్లో పాల్గొనగా శాంతినగర్ శ్లోకా స్కూల్ విద్యార్థులు గెలిచారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ కప్‌ను విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్లోకా స్కూల్ ప్రిన్సిపాల్, డైరెక్టర్ నాగేశ్వర్, డైరెక్టర్స్ రతన్ ప్రకాష్ జైస్వాల్, ఎం.తిరుమల్‌రావు, అన్వేష్, వైస్ ప్రిన్సిపల్ అమిత ఛరణ్, యువ మంచ్ అధ్యక్షుడు గురుఛరణ్ తదితరులు పాల్గొన్నారు.